# సింహం - వడ్రంగి

అనగనగా ఒక ఊర్లో ఒక వడ్రంగి ఉండేవాడు. వాడు రోజూ అడవికి వెళ్ళి కట్టెలు కొట్టుకుని తెచ్చి ఊర్లో అమ్ముకుని, వచ్చిన ధనంతో రోజువారి సామానులు అవీ కొనుక్కుని కాలం గడుపుతూ ఉండేవాడు. సరే రోజులాగే ఒక రోజు అడవికి వెళ్ళాడు. కట్టెలు కొట్టుకుని తిరిగి వస్తూండగా అప్పుడు , మన వడ్రంగికి ఒక పెద్ద సింహం ఎదురయ్యింది. ఇంకేం, మన వాడు బిత్తరపోయి భయపడుతూ ఒక చెట్టుకి అతుక్కుని పోయాడు.

మన మృగరాజు చాల మంచివాడు అవ్వటం చేత పీడి భయం చూసి , నిన్ను ఏమీ చెయ్యనులే వెళ్ళిపో అని అభయం ఇచ్చింది. దానికి వడ్రంగి చాలా సంతోషించి బతుకుజీవుడా అని ఇంటికి వచ్చి, సింహం దయ చూపినందుకు కృతజ్ఞతగా రోజూ అడవికి వెళ్ళినప్పుడు ఏదో ఒక ఆహారం తీసుకుని వెళ్ళి దానికి పెట్టేవాడు. అలా సింహము వడ్రంగి స్నేహితులుగా మారారు.

ఒక రోజు మృగరాజు తన గుహలో ఉండగా దాని సేవకులు టక్కరి నక్క, అబద్ధాల కాకి వచ్చాయి. వచ్చి "అయ్యా... మీరు గత కొన్ని రోజులుగా వేటకి వెళ్ళటం మానేసారు . ఎందుకు ?" అని అడిగాయి. అప్పుడు సింహం " నాకు ఒక వడ్రంగి స్నేహితుడు ఉన్నాడు, అతను రోజూ ఏదో ఒక ఆహారం తెచ్చి ఇస్తున్నాడు. అందుకని నేను వేటకి వెళ్ళట్లేదు" అని చెప్పింది. అప్పటిదాకా మన వడ్రంగిని చూడని నక్క, కాకి సరే ఇవ్వాళ్ళ ఎలాగయినా వాడు ఎవడో చూద్దాము అని సింహం పక్కనే కూర్చున్నాయి.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

రోజూ లాగే మన వడ్రంగి వచ్చాడు. నక్కని , కాకిని చూసి వెంటనే పరిగెత్తుకుని పోయి చెట్టు మీద ఎక్కి కూర్చున్నాడు. సింహం ఆశ్చర్యపోయి "స్నేహితుడా, ఎందుకు అలా చెట్టు మీదకి ఎక్కావు" అని అడిగింది.

అప్పుడు మన వడ్రంగి ఏమన్నాడో తెలుసా "నువ్వు సజ్జనుడవే కావచ్చు. కాని నీకు ఇలాంటి దుర్జనులు స్నేహితులుగా ఉన్నారు అని నాకు తెలియదు. దుర్జనులతో సహవాసం చేసిన నువ్వు కూడా దుర్జనుడి కిందే లెక్క, ఇక నువ్వు నేను స్నేహితులం కాదు" అని చెప్పాడు.

## మరి ఈ కథలో నీతి ఏమిటి పిల్లలూ ?

## ఎప్పుడూ మంచి వాళ్ళతోనే స్నేహం చెయ్యాలి అని. చెడు సహవాసాలు ఎన్నటికీ పనికిరావు.

**Keywords: Simham - Vadrangi katha, Telugu lo chinna Kathalu, Telugu lo neeti kathalu, china pillala kadhalu, neeti vakyamulu**

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com